క్లుప్తంగా

బాల్య వివాహాలు నేరం

లక్కిరెడ్డిపల్లె : బాల్య వివాహాలు నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ చిన్న వయసులోనే ఆడపిల్లలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, చిన్నవయసులో వివాహాలు చేసుకుంటే నేరమని, బాల్య వయస్సులో పిల్లలకు వివాహాలు చేస్తే తల్లిదండ్రులకు శిక్ష పడుతుందన్నారు. బాల బాలికలు పనులకు వెళ్లకుండా బడికి వెళ్లాలని ఆమె సూచించారు. వీధిబాలలు స్థానిక పాఠశాలలో చదువుకోవాలన్నారు. ఆడపిల్లలు అత్యవసర పరిస్థితిలో 100, 1098 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ఆడపిల్లలకు ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఉన్నాయని, వాటిలో పీజీ వరకు చదువుకోవచ్చని ఆమె విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, సూపర్‌వైజర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంబాలకుంటను దతత్త తీసుకున్న ఎన్ఎస్ఎస్

పెనగలూరు : కంబాలకుంట పంచాయతీని ఎన్ఎస్ఎస్ దత్తత తీసుకుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సహజ బ్లెస్సీ, కో – ఆర్డినేటర్ రామిరెడ్డిలు అన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్‌లో పాల్గొంటున్న విద్యార్థులను ద్దేశించి వారు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల కెరీర్ మార్గదర్శకత్వంపై పలు సూచనలు చేశారు. కంబాలకుంటలో స్పెషల్ క్యాంప్ నిర్వహించి గ్రామంలో పరిసరాలను పరిశుభ్రం చేస్తామన్నారు. సేవ చేయడమనేది విద్యార్థుల కెరీర్ ఎన్ఎస్ఎస్‌తో ప్రారంభమవుతుందని వారు పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు హేమలత, కృష్ణవేణి, హౌస్ మొహిద్దీన్, అధ్యాపక బృందం వెంకటరామిరెడ్డి, రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు స్థల పరిశీలన



స్థల పరిశీలనలో సబ్‌కలెక్టర్ అహ్మద్‌ఖాన్

నందలూరు(రాజంపేట) : నందలూరు సబ్‌స్టేషన్ వెనుకవైపు ఉన్న 1160/1–4 సర్వే నెంబరులో ఉన్న ఎకరా స్థలాన్ని ప్రభుత్వాసుపత్రి, జూనియర్ కాలేజీ నిర్మాణ కోసం నిమిత్తం బుధవారం సబ్‌కలెక్టర్ అహ్మద్‌ఖాన్ పరిశీలించారు. స్థలానికి సంబంధించి పూర్తి వివరాలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు ఉదయశంకర్‌రాజు మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రి, కాలేజీ నిర్మాణం కోసం స్థలం ఎంపిక చేశామన్నారు. ఈ స్థలాన్ని సబ్‌కలెక్టర్ పరిశీలించారన్నారు. ఈయనతోపాటు స్థానిక రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి



రైతులకు ఈ-పంట నమోదు పత్రాలను అందజేస్తున్న దృశ్యం

సిద్దవటం : ఏప్రిల్ నెలాఖరులోపు ప్రతి రైతు పి.ఎం. కిసాన్, ఈ–కేవైసీని రైతు భరోసా కేంద్రాలలో తప్పకుండా చేయించుకోవాలని లేదంటే పి.ఎం. కిసాన్ నిధులను పొందేందుకు అనర్హులవుతారని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. మండలంలోని బొగ్గిడివారిపల్లె, ఉప్పరపల్లెలోని రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. రైతులతో ఖరీఫ్ పంటల ప్రణాళిక, పచ్చి రొట్ట ఎరువుల పంపిణీపై చర్చించారు. రబీ సీజన్‌కు సంబంధించి ఈ – పంట నమోదు ధృవీకరణ పత్రాలు రైతులకు అందజేశారు. రైతు భరోసా కేంద్రాల్లో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులను ఆయన కోరారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో ఆధార్ సీడింగ్



ఆధార్ సీడింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు అరుంధతివాడ అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం ఆధార్ సీడింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యమ్మ, కె.కన్నమ్మల ఆధ్వర్యంలో ఆధార్ సీడింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు అయిన వారికి తేదీల ఆధారంగా, జనన ధృవీకరణ పత్రాల ఆధారంగా ఆధార్ సీడింగ్ చేశామన్నారు. అలాగే నల్లపరెడ్డిపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో నీలమ్మ ఆధార్ సీడింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పేదలకు అందుబాటులోకి అధునాతన వైద్య సేవలు

- రూ. 7 కోట్ల నాడు – నేడు పనులతో మారిన లక్కిరెడ్డిపల్లె ఏరియా ఆస్పత్రి రూపురేఖలు
- కార్పొరేట్ ఆస్పత్రిని తలదన్నుతున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్
- 24న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న లక్కిరెడ్డిపల్లె సీహెచ్‌సీ భవనం

లక్కిరెడ్డిపల్లె : ప్రజలు నమ్మకంతో ఎన్నుకున్న జగనన్న ప్రభుత్వం వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తుందనడానికి నాలుగేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి, వాటి ద్వారా ప్రజలకు అందుతున్న ఫలాలే ఇందుకు నిదర్శనం. అందులో ప్రధానమైనవి విద్య, వైద్యం, సంక్షేమం. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి జగనన్న సహకారంతో అన్ని రంగాలలో అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారు. అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి జగనన్న ప్రభుత్వం తీసుకొచ్చిన నాడు – నేడుతో ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు మారుతున్నాయి. విస్తృతంగా వైద్య సేవలు అందుబాటులోకి తెస్తున్నారు. రాయచోటి నియోజకవర్గంలోని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రూ. 7 కోట్ల నిధులతో నూతనంగా నిర్మాణం చేపట్టిన 30 పడకల ఆసుపత్రిని ఈనెల 24న లోక్‌సభ ప్యానల్ స్పీకర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలు ప్రారంభించనున్నట్లు సంబంధిత అధికారులు తెలియజేశారు. అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి 30 పడకల ఆసుపత్రి ప్రారంభానికి సంబంధించిన ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కృషితో నాడు – నేడు ద్వారా రూ. 7 కోట్లకు పైబడి నిధులతో లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటైన 30 పడకల ఆసుపత్రిక వేసిన రంగులు, ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను తెలిపే చిత్రాలు, ఇన్ఫో గ్రాఫిక్స్‌తో నూతన ఆసుపత్రి భవనం కొంగొత్తశోభను సంతరించుకున్నది. సీహెచ్‌సీలో మౌలిక వసతుల కల్పన పనులు పూర్తయ్యాయి. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా అటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను జగన్ ప్రభుత్వం బలోపేతం చేస్తోంది. అటు వైద్యులు, ఇటు సిబ్బందిని అవసరమైనంత మందిని ఇప్పటికే నియమించింది. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 108, 104 సేవలను జగన్ ప్రభుత్వం విస్తృతం చేసింది. సీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో వైద్య సేవలు, వసతులు పెరగడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం జగన్, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలకు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



అందుబాటులోకి రానున్న ఆపరేషన్ గది

మెరుగైన వైద్య సేవలందిస్తాం



గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయి. 8 మంది వైద్య సిబ్బందితో ప్రతిరోజూ 250 నుంచి 300 మంది అవుట్ పేషెంట్స్ వస్తూ ఉంటారు. 46 మంది సిబ్బందితో 24 గంటలు ఓపీ ఉంటుంది. 30 పడకల నూతన భవనం నిర్మాణం చేపట్టడం ఈ ప్రాంత ప్రజలకు ఒక వరం. ఎంపీ, ఎమ్మెల్యేలకు మా తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– నీలోఫర్ బేగం,
ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, లక్కిరెడ్డిపల్లె

రంజాన్ కానుక అందజేత

రామాపురం : రంజాన్ మాసంలో పేద ముస్లింకు రంజాన్ కానుక అందించడం పుణ్య కార్యమని జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి జాకీర్ హుస్సేన్ అన్నారు. బుధవారం మండలంలోని నీలకంఠ్రావుపేట గ్రామ పరిధిలోని ముస్లింలకు రంజాన్ కానుకను అందించారు. మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలు సంతోషంగా ఉండడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్ష్యమని, రంజాన్ పండగను ముస్లిం సోదరులు సంతోషంగా జరుపుకోవాలనే పార్టీ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో పీఏస్టీయూ రాష్ట్ర నాయకుడు మజహరూల్ హక్, జాకీర్ హుస్సేన్, ఖదీర్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

రాజంపేట రూరల్ : భువనగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. మే నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మండలి తెలియజేశారు. అలాగే స్వామివారి కల్యాణ మహోత్సవం మే 6వ తేదీ ఘనంగా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోండి

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల, నాయకులు

ఓబులవారిపల్లె : కంప్యూటర్ ల్యాబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆల్ఫా మెరైన్ ఎండీ దూడల సూధాకర్ యాదవ్ సహకారంతో దాదాపు రూ.70 లక్షలతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ సూదకర్ యాదవ్ గొప్ప మనసుతో ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయడం హర్షణీయమని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాడు – నేడు కార్యక్రమంతో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయన్నారు. అమ్మఒడి, గోరుముద్ద, విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన, తదితర సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. స్థానిక పాఠశాలకు ఏపీఎండీసీ నిధులతో ఆర్ఓ మినరల్ వాటర్ ప్లాంటు మంజూరైందని తెలిపారు. ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రం పున్నాటివారిపల్లె గ్రామానికి చేందిన దూడల సూదకర్ యాదవ్ మండల కేంద్రంలోని పాఠశాల, వైకోట, కస్తూర్బా గాంధీ ఉన్నత పాఠశాల తదితర ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్లు అందించడాన్ని అభినందించారు. దూడల సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లు వాడటం పూర్తిగా మానివేయాలని సూచించారు. కంప్యూటర్‌లను సద్వినియోగం చేసుకొని జ్ఞానాన్ని పెంచుకోవాలని అన్ని వార్తాపత్రికలను చదవడం అలవర్చుకోవాలన్నారు. అనంతరం సీనియర్ నాయకులు ఓజీ శ్రీనివాసులరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రమణయ్యలు మాట్లాడారు. పెద్దఓరంపాడు రైతులు తమ పంట పొలాలకు చెరువు నుంచి మట్టిని తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల దృష్టికి తీసుకొనిరాగా వారు వెంటనే సంబంధిత అధికారులుతో ఫోన్‌లో మాట్లాడి రైతులకు వ్యవసాయ భూములకు చెరువులో మట్టి తీసుకొనేందుకు సహకారం అందించాలని ఆదేశించారు. దీంతో రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర, సర్పంచ్‌లు ఎస్‌పీ జయపాల్‌రెడ్డి, మల్లెం ఈశ్వరయ్య, జరుగు నారాయణరెడ్డి, పోలి పాపిరెడ్డి, జిల్లా కో–ఆప్షన్ మెంబర్ అన్వర్ బాషా, సీనియర్ నాయకులు ఓజీ శ్రీనివాసులరెడ్డి, ఎస్‌పీ శివారెడ్డి, సానుగారి సుబ్బారెడ్డి, ఎమ్మెస్సార్, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గడ్డం ఆదినారాయణరెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సుంకేసుల రఫీ ఎంపీడీఓ విజాయరావు, పాఠశాల ఎస్ఎంసీ కమిటీ చైర్మెన్ శ్యామల, వైస్ ఎంపీపీ జీ.గౌరిశంకర్ రాజు, ఎంపీటీసీలు, పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ బలం



సిద్దవటం: తమకు అందిన పథకాల బుక్‌లెట్‌ను చూపుతున్న మహిళలు



పుల్లంపేట: ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న కొల్లం గంగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సిద్దవటం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి బలమని వైఎస్ఆర్‌సీపీ మండల యూత్ కన్వీనర్ క్రిష్ణచైతన్య అన్నారు. మండల కేంద్రంలోని గాంధీవీధిలో బుధవారం సాయంత్రం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అములు చేసిన సంక్షేమ పథకాలు అందాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇంటిపెద్దల అనుమతితో ఇంటికి జగనన్న స్టిక్కర్‌ను అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్న సుబ్బరాయుడు, వి. పుల్లయ్య, మహిళలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీ పాలనకు ప్రజలు బ్రహ్మరథం

వైఎస్ఆర్‌సీపీ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని సచివాలయాల సిద్దవటం మండల కన్వీనర్ చింతకుంట రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. పరమాత్మ సేవా వృద్ధాశ్రమంలో బుధవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డిల ఆధ్వర్యంలో సిద్దవటం మండలంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ఎక్కడి వెళ్లినా విశేష స్పందన వచ్చిందన్నారు. ప్రభుత్వ ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందించినందుకే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు మద్దతు తెలుపుతున్నారన్నారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా రాజంపేట నియోజక వర్గంలో మళ్లీ ఎమ్మెల్యేగా మేడా మల్లికార్జునరెడ్డి భారీ మెజార్టితో గెలుస్తారని జోస్యం పలికారు.

వత్తలూరులో..

పుల్లంపేట : మండల పరిధిలోని వత్తలూరు గ్రామంలో బుధవారం జగనన్న నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లం గంగిరెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ను ప్రజలకు అందించి ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుల మతాలకు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడం జరిగిందని, కావున వచ్చే ఎన్నికలలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా మరొక్కసారి గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మూరే శంకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన

చిట్వేలి : ఆరోగ్యం, పరిశుభ్రత పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నీరజ సూచించారు. 30వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కడప ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరోగ్యం, పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు డేవిడ్ ప్రసాద్, ఉపాధ్యాయులు దుర్గరాజు, మధుసూదన్ రావు, ఏఎంఓ పద్మావతి, కల్పన, కన్యాకుమారి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్ సర్వే ప్రారంభం

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీ ఇండ్లూరు రెవెన్యూ గ్రామంలో బుధవారం డ్రోన్ సర్వేను తహసీల్దార్ శ్రీధర్ రావు ప్రారంభించారు. మండల సర్వేయర్ ఓబయ్య ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది సర్వేలో పాల్గొన్నారు. డ్రోన్ సర్వే ప్రారంభించిన అనంతరం తహసీల్దార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ చంద్రమోహన్ రెడ్డి, మండల సర్వేయర్ ఓబయ్య, సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు బాషా, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాలలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం శిబ్యాల గ్రామం కస్పాలో డీపీఓ ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఈఓపీఆర్డీ సురేష్ బాబు చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె గ్రామంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిణి డాక్టర్ శారదమ్మ అన్నారు. ఈ సందర్భంగా ఆమె పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా పశుసంవర్ధక శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్టు తెలిపారు. దూడలకు నట్టల నివారణ మందును తాపించారు. వేసవి కాలంలో పశువులలో తీసుకోవాల్సిన జాగ్రతల గురించి పాడి రైతులకు తెలియజేశారు. 21 ఆవులు, గేదెలకు గర్భనిర్ధారణ పరీక్షలు, 7 పశువులకు గర్భకోశ వ్యాధికి చికిత్సలు, 16 అనారోగ్య బారిన పడిన పశువులకు వైద్య పరీక్షలు, 29 దూడలకు నట్టల నివారణ మందులు, 153 మేకలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులు, కోళ్లకు కొక్కెర తెగుళ్లు రాకుండా చికిత్సలు చేసి ఉచితంగా మందులను అందజేశామని ఆమె అన్నారు. కార్యక్రమంలో కడప ఉప సంచాలకులు డాక్టర్ రమణయ్య, డాక్టర్ ఎం.వి. సుబ్బరాయుడు, వైద్యులు డాక్టర్ శ్వేత, వాటర్ షెడ్ సిబ్బంది రామచంద్ర, పశుసంవర్ధక శాఖ సిబ్బంది జిలనీబాషా, ఉమామహేశ్వర రావు, ఓబులేసు, క్రిష్ణయ్య, సుబ్బనరసింహులు, పాడి రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : జిల్లా కేంద్రంలోని రాయచోటి రింగ్ రోడ్డు సమీపంలో నిర్మిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణ పనులను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషాతో కలిసి శరవేగంగా జరుగుతున్న కార్యాలయ నిర్మాణ పనులను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న పనుల నాణ్యతపై వారు ఆరా తీశారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలని శ్రీకాంత్ రెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. పరిశీలనలో సివిల్ సప్లయిస్ స్టేట్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, మండల బీసీ నాయకుడు పల్లపు రమేష్, నాయకులు గౌస్ ఖాన్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, జానం రవీంద్రయాదవ్, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నివాళి

రామాపురం : మండల పరిధిలోని రాచపల్లె గ్రామం గంగనేరుకు చెందిన చిన్న చెన్నారెడ్డి సతీమణి రాములమ్మ(75) మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి బుధవారం మృతురాలి స్వగృహానికి చేరుకొని రాములమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ వెంకటరమణ, సర్పంచ్ వెంకటరెడ్డి, ఆదినారాయణరెడ్డి తదితరులు నివాళి అర్పించారు.

పరామర్శ

మండల పరిధిలోని సుద్దమళ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు చింతల జనార్దన్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుధవారం పట్టణంలోని వినాయకవీధిలో విశాంత్రి తీసుకొంటున్న జనార్దన్‌రెడ్డిని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు స్టేట్ సివిల్ సప్లయ్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, మండల బీసీ నాయకులు రమేష్, దేవ తదితరులున్నారు.

ఘనంగా ఆకేపాటి పుట్టినరోజు వేడుకలు



రాజంపేట రూరల్: ఆకేపాటి భవన్‌లో జెడ్పీ చైర్మన్ జన్మదిన సంబరాలు నిర్వహిస్తున్న నాయకులు

రాజంపేట రూరల్ : జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్ ఆవరణలో ఉన్న ఆలయాల సముదాయంలో ఉదయం జెడ్పీ చైర్మన్ పేరిట అభిమానులు ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అభిమానులు కేక్ కట్ చేశారు. అదే విధంగా ఆకేపాటి ఎస్టేట్‌కు పెద్దఎత్తున తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. అనంతరం పాల్గొన్న వారికి భోజన వసతి కల్పించారు. ఆకేపాటి ఎస్టేట్‌లోని ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఉపాధ్యాయ బృందం విద్యార్థుల మధ్య జెడ్పీ చైర్మన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు.

పట్టణంలోని ఆకేపాటి భవన్‌లో జెడ్పీటీసీ దాసరి ప్రశాంతి పెంచలయ్య ఆధ్వర్యంలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి జన్మదిన వేడుకలను చేశారు. ముందుగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ వేడుకలలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆకేపాటి అనీల్‌కుమార్ రెడ్డి, పోలా వెంకటరమణారెడ్డి, మర్రి రవికుమార్, పి.విశ్వనాథరెడ్డి, దండు గోపీ, బి.రామ్మోహన్ నాయుడు, ఎం.సురేఖ, దాసరి పెంచలయ్య, ఎస్.నాగేశ్వరనాయుడు, డీలర్ సుబ్బరామిరెడ్డి, ఎస్.జాహీద్‌అలీ, పి.మసూద్‌అలీఖాన్, జె.వెంకటరెడ్డి, వి.గంగిరెడ్డి, ఎ.అశోక్‌కుమార్, ఎస్.శేఖర్‌రెడ్డి, పి.శెంకరశెట్టి, ఎస్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటంలో..

సిద్దవటం : సిద్దవటం – భాకరాపేట మార్గమధ్యలోని పరమాత్మ సేవా వృద్ధాశ్రమంలో బుధవారం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలను సిద్దవటం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేక్‌ను కట్ చేసి ఆశ్రమంలోని వృద్ధులకు కేక్, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, జిల్లా ప్రధాన కార్యాదర్శి కె.వి.సుబ్బయ్య, మండల యూత్ కన్వీనర్ క్రిష్ణచైతన్య, ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతోనే అగ్నిప్రమాదాల నివారణ



రాజంపేట రూరల్: రెస్క్యూ విధానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



రాయచోటి టౌన్: సూచనలు తెలియజేస్తున్న ఫైర్ స్టేషన్ అధికారులు

రాయచోటి టౌన్ : ముందస్తు జాగ్రత్తల ద్వారానే అగ్నిప్రమాదాల ద్వార ప్రాణ, ఆస్తి నష్టాల నుంచి మనల్ని మనం ఎలా కాపాడుకోవాలనే విషయాలపై రాయచోటి ఫైర్‌స్టేషన్ అధికారులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం అగ్నిప్రమాదాల నివారణ వారోత్సవాలలో భాగంగా 6వ రోజున రాయచోటి ఫైర్ స్టేషన్ అధికారి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులకు, వైద్య సిబ్బందికి అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే అగ్ని ప్రమాదాలలోని సిలిండర్ లీకేజీ, డీజల్, పెట్రోల్ వంటి ప్రమాదాలు జరిగిన సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలనే విషయాలపై డెమో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఫైర్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలు జరిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అగ్నిమాపక అధికారి బాల ఉస్సేనయ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్నిప్రమాదాల నివారణపై పలు విన్యాసాలు ద్వారా సిబ్బందికి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో రకరకాల రోగులు ఉంటారని, వారికోసం ఎప్పుడైనా ఆక్సిజన్ ఓపెన్ చేసినప్పుడు మంటలు వ్యాపిస్తే వెంటనే చేయాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిటెండెంట్ నీలోఫర్ బేగం, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట రూరల్ : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఆరవ రోజైన బుధవారం ఆర్ఎస్ రోడ్‌లోని డాక్టర్ కృష్ణాస్ ఆస్పత్రి వద్ద వైద్య సిబ్బందికి అగ్నిమాపక కేంద్ర అధికారి పి.శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ముందుగా వైద్య సిబ్బందికి ప్రమాద నివారణ కరపత్రాలు పంపిణీ చేశారు. ఎల్పీజీ గ్యాస్ సిలెండర్ ద్వారా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఎలా మనలను మనము రక్షించుకోవాలో అదే విధంగా మన తోటి వారిని ఎలా రక్షింపజేయాలో అవగాహన కల్పిస్తూ వారితోనే రెస్క్యూ మెథడ్‌లపై అవగాన కల్పించారు. పై అంతస్తులో ప్రమాదం సంభవించినపుడు ఏవిధంగా మంటలు ఆర్పి వేయాలో వివరించి చైతన్యవంతులను చేశారు. ఎక్కడైనా ప్రమాదం నెలకొంటే 101, 08565–240299 నెంబర్లకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ఓలు బి.సత్యరాజు, బీసీఆర్ సుబ్రమణ్యం, పి.రవీంద్రబాబు, డీఓలు డి.శివయ్య, సి.నాగూర్ బాషా, ఎఫ్ఎంలు కె.రాజేష్, జే.శివశంకర్, హోంగార్డులు సి.రవీంద్రబాబు, జి.చక్రవర్తి, యు.రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి వనరులను కాపాడుకుందాం

రాయచోటి అర్బన్ : గ్రామీణ ప్రాంత ప్రజల మనుగడ ఉమ్మడి వనరులపై ఆధారపడి ఉందని, వాటిని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ సంస్థ సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ రాణిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని మదనపల్లె రోడ్డులో ఉన్న అభిరుచి రెస్టారెంట్‌లో ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ సొసైటీ ఆధ్వర్యంలో ఉమ్మడి వనరుల సంరక్షణ, అభివృద్ధిపై స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులతో ఒక్కరోజు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉమ్మడి వనరుల అభివృద్ధే లక్ష్యంగా, ఎటువంటి లాభాపేక్ష లేకుండా తమ సంస్థ పనిచేస్తుందన్నారు. అన్ని మండలాల్లో ఉమ్మడి వనరుల అభివృద్ధిపై సర్పంచులు, ఉపాధిహామీ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. భవిష్యత్తులో స్వచ్ఛంద సంస్థలతో కలసి పని చేస్తామన్నారు.

సీనియర్స్ క్రికెట్‌కు ఎంపికైన నందలూరు క్రీడాకారులు

నందలూరు(రాజంపేట) : సీఏవైడీ (క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ డిస్ట్రిక్) నందలూరు సబ్‌సెంటర్‌కు చెందిన ఐదు మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈమేరకు బుధవారం నందలూరు సబ్‌సెంటర్ కోచ్‌లు సయ్యద్‌గయజ్(హెడ్‌కోచ్), అసిస్టెంట్ ఫిరోజ్‌ఖాన్‌లోడి, ట్రైనర్ శివకోటి ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఎంపికైనవారిలో జాఫర్‌అలీఖాన్, ఆసీఫ్ హుస్సేన్, కెఎంఎస్ ఆచారి, ఆదిల్ హుస్సేన్, యశ్వంత్‌లు ఉన్నారన్నారు. వీరు ఏప్రిల్ 21 నుంచి కడపలో జరిగే సీనియర్స్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని చెప్పారు. సీఏవైడీ నుంచి ఇప్పటికే అండర్ – 12, 14, 16, 19 విభాగాల నుంచి యువతీయువకులు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రికెట్‌లో తమ ప్రతిభను చాటారన్నారు. సమ్మర్ కోచింగ్ క్యాంప్ 8 సంవత్సరాల నుంచి 23 సంవత్సరాల వయస్సు కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.